క్లుప్తంగా

నేడు మండల సమావేశం

పెద్దముడియం: మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశాన్ని మంగళవారం ఉదయం 10.30 గంటలకు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో సైరాభాను తెలిపారు. ఈ సమావేశానికి మండల స్థాయి అధికారులు, ప్రజా ప్రతినిధులు తప్పనిసరిగా హాజరుకావాలని తెలిపారు. అధికారులందరూ గడచిన మూడు నెలల కాలంలో మండలంలో జరిగిన అభివృద్ధి పనులకు సంబంధించి నివేదికలతో హాజరు కావాలని కోరారు.

ఘనంగా సంకటహర చతుర్థి

వేంపల్లె : స్థానిక మెయిన్ బజార్‌లోని శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో సోమవారం సంకటహర చతుర్థి పూజలను భక్తులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు శాకల్య వెంకటనరసయ్య శర్మ నేతృత్వంలో వినాయకుడికి వేద మంత్రాలతో పంచామృతాభిషేకం, గణపతి పూజ, అర్చన తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ సంకట హర చతుర్థి రోజున విఘ్నేశ్వరుడిని పూజిస్తే కష్టాలు తొలగిపోతాయని నమ్మకమని తెలిపారు. ఆర్య వైశ్య మహిళలు అష్టోత్తరాలు, సంకటహర చతుర్థి వ్రత కథ పఠించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు మిట్టా మోహన్ రావు, ఆర్యవైశ్య మహిళలు, ఆర్యవైశ్య మహిళా మండలి కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

రక్తదానంపై అపోహలు వద్దు



రక్తదానం చేస్తున్న వారిని అభినందిస్తున్న సీఐ లింగప్ప

జమ్మలమడుగు: రక్తదానం గురించి అపోహలు పనికిరావని, ఆరోగ్యవంతులు రక్తదానం చేయడం వలన ఆరోగ్యం మరింత మెరుగవుతుందని అర్బన్ సీఐ లింగప్ప పేర్కొన్నారు. సోమవారం సురేంద్ర చారిటబుల్ ట్రస్టు, యువ బ్లడ్ డోనర్స్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీఐ లింగప్ప మాట్లాడుతూ ప్రమాదాల్లో గాయపడిన వారికి సమయానికి రక్తం అందక ప్రాణాలు కోల్పోతున్నారని తెలిపారు. రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని సూచించారు. ఈ రక్తదాన శిబిరంలో 30 మంది యువకులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శివకుమార్, ట్రస్టు అధ్యక్షుడు సురేంద్ర, నెల్సన్, ప్రసాద్‌రెడ్డి డాక్టర్ శ్రీలత పాల్గొన్నారు.

రైతులను ఆదుకోండి

సింహాద్రిపురం : వ్యవసాయాన్ని పరిశ్రమగా గుర్తించాలని, వీలుకానీ పక్షంలో రైతును ఉత్పత్తిదారుడిగా ప్రకటించి ఆదుకోవాలని అంకాలమ్మగూడూరు గ్రామ రైతు ఇంద్ర సేనారెడ్డి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను వేడుకున్నారు. సోమవారం మండలంలోని అంకాలమ్మగూడూరు గ్రామంలో ఆయన మాట్లాడుతూ తన వంతు ప్రయత్నంగా జీవ కారణ్య అనే సంస్థను ఏర్పాటు చేశానని, ఈ సంస్థలో రైతుల సమస్యలతోపాటు జంతువుల సంరక్షణపై రైతులకు అవగాహన కల్పిస్తూ రైతులను భాగస్వాములను చేయడానికి మొదలు పెట్టడం జరిగిందన్నారు. ప్రస్తుతం భారత రైతు దేహి అంటూ జోల పడుతున్నాడని, రైతులకు ఉచితంగా పశుగ్రాసం, ఎరువులు, విత్తనాలు సరఫరా చేయాలని, రైతును రుణ విముక్తి చేయమని దేహి అంటూ జోల పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు.

ఫ్లెక్సీలు, బోర్డులు తొలగింపు



రోడ్డుకు అడ్డంగా ఉన్న బోర్డును తొలగిస్తున్న పోలీసులు

జమ్మలమడుగు: చిలంకూరు గ్రామంలో కడప-ముద్దనూరు రహదారికి అడ్డంగా ఉన్న ఫ్లెక్సీలు, బోర్డులను పోలీసులు తొలగించారు. సోమవారం ఉదయం ఎర్రగుంట్ల మండలంలోని చిలంకూరు గ్రామంలో పోలీసులతో కలిసి కాలినడకన సీఐ నరేష్‌బాబు పెట్రోలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా రోడ్డుకు అడ్డంగా ఉన్న ఫ్లెక్సీలు, ఇతర వాహనాలు, నేమ్ బోర్డులను తొలగించారు. జాతీయ రహదారిలో ఎటువంటి అడ్డంకులు సృష్టించవద్దని సూచించారు. చిరు వ్యాపారులు ఫుట్‌పాత్‌లపైనే దుకాణాలు ఏర్పాటు చేసుకొని వ్యాపారాలు చేసుకుంటున్నారని తెలిపారు. స్థానికులు ఎక్కడ పడితే అక్కడ వాహనాలు నిలపడం వలన ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని సీఐ తెలిపారు.

గ్రామాల్లో పోలీసుల గస్తీ

సింహాద్రిపురం : మండలంలోని హిమకుంట్ల, బిదినంచర్ల గ్రామాల్లో సోమవారం ఎస్ఐ రవి కుమార్‌తోపాటు స్పెషల్ పార్టీ పోలీసులు గస్తీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు గ్రామాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గస్తీ నిర్వహించామన్నారు. కడప కోర్టులో ఈ రెండు గ్రామాలకు చెందిన వ్యక్తుల తీర్పు వెలువడిన నేపథ్యంలో ఈ గస్తీ నిర్వహించామన్నారు. యల్లనూరు క్రాస్ రోడ్డు వద్ద వాహనాల తనిఖీలు చేపట్టారు. పలు వాహనాలకు సంబంధించిన రికార్డులు సరిగా లేని వాటికి, లైసెన్స్ లేని వారికి జరిమానాలు విధించారు. గ్రామాల్లో ప్రశాంతంగా జీవించాలని సూచించారు.

కాలువలు ఇలా.. నీరు పారేదెలా..?



జమ్ముతో నిండిన పులివెందుల బ్రాంచ్ కెనాల్



కెనాల్‌కు ఇరువైపులా పెరిగిన కంపచెట్లు

- పూడికతో నిండిపోయిన పులివెందుల బ్రాంచ్ కెనాల్
- కాలువలో పెరిగిన జమ్ము, కంపచెట్లు
- సకాలంలో దిగువకు చేరని నీరు
- సాగునీరు అందక ఎండుతున్న పంటలు

వేముల : పులివెందుల ప్రాంత రైతులకు ఆయువు పట్టుగా ఉన్న పులివెందుల బ్రాంచ్ కెనాల్ పూడికతో నిండిపోయింది. పులివెందుల చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నుంచి వేంపల్లె వరకు 68 కిలోమీటర్ల మేర పులివెందుల బ్రాంచ్ కెనాల్ ఉంది. ఈ కాలువకు ఉన్న ఉప కాలువల ద్వారా పంటలకు సాగునీరు అందించడమే లక్ష్యంగా పులివెందుల బ్రాంచ్ కెనాల్ ఏర్పాటైంది. అయితే పులివెందుల బ్రాంచ్ కెనాల్ పూడికతో నిండిపోయింది. పీబీసీ పైభాగాన ఉన్న పొలాల నుంచి వర్షపు నీరు కాలువలోకి చేరుతుంది. దీంతో పొలాల నుంచి వర్షపు నీటితోపాటు మట్టి కొట్టుకు వచ్చి కాలువలో పేరుకుపోయింది. కాలువ పూడికతో నిండిపోవడంతో పులివెందుల బ్రాంచ్ కెనాల్ లక్ష్యం నెరవేరడం లేదు.

ప్రతిపాదనలు వెనక్కి..

పులివెందుల బ్రాంచ్ కెనాల్‌లో జమ్ము, కంపచెట్లు పెరిగిపోయాయి. ఈ కాలువ 42 కి.మీ నుంచి 62కి.మీ వరకు పీబీసీ కాలువ పూడికతో నిండిందని పీబీసీ అధికారులు చెబుతున్నారు. ఈ కాలువలో పూడికతీతను తొలగించేందుకు ప్రతిపాదనలు పంపితే నిధులు లేవని ప్రతిపాదనలు వెనక్కి వచ్చాయని పీబీసీ కార్యాలయ అధికారులు అంటున్నారు. కాలువలో పూడికను తొలగిస్తేనే నీరు విడుదల చేసేందుకు వీలవుతుందని, లేదంటే నీరు వదిలినా దిగువకు వెళ్లలేని పరిస్థితి ఉందని అధికారులు చెబుతున్నారు. కాలువలో 3 నుంచి 4 కిలోమీటర్ల మేర జమ్ము పెరగడంతోపాటు కాలువకు ఇరువైపులా కంపచెట్లు మొలకెత్తాయి.

అందని నీరు

పీబీసీ కాలువ పూడికతో నిండిపోవడంతో సకాలంలో దిగువకు కాలువ నీరు చేరడంలేదు. కాలువలో మట్టి, జమ్ము, కంపచెట్లతో నీరు వెళ్లలేని పరిస్థితి ఉంది. దీంతో పీబీసీ కాలువకు నీరు వదిలినా దిగువకు చేరడం లేదు. దిగువ ప్రాంతమైన వేంపల్లె వరకు కాలువ నీరు వెళ్లేందుకు రోజుల తరబడి పడుతోందని అధికారులు అంటున్నారు. చిత్రావతి వద్ద కాలువకు ఎక్కువ నీరు వదిలితే కొన్ని చోట్ల కాలువ పొంగి పొర్లుతుందే తప్ప, దిగువ ప్రాంతానికి నీరు చేరడం కష్టంగా ఉంటోందని అధికారులు చెబుతున్నారు. పీబీసీ కాలువకు సిమెంటు లైనింగ్ ఉన్నప్పటికి కాలువలో చేరిన మట్టితోనే జమ్ము పెరిగి ఇబ్బందిగా మారిందని అధికారులే ఒప్పుకుంటున్నారు. దీంతోనే వేంపల్లె ప్రాంతంలో ఉప కాలువల కింద పంట సాగుకు రైతులు సాహసించడం లేదు.

ఉప కాలువల కింద సాగు

పులివెందుల బ్రాంచ్ కెనాల్‌కు అనుసంధానంగా ఉన్న ఉప కాలువల కింద రైతులు పంటలు సాగు చేసుకున్నారు. లింగాల మండలం నుంచి వేముల మండలం వరకు ఉప కాలువల కింద రైతులు అక్కడక్కడ పంటలు సాగు చేసుకున్నారు. చిత్రావతిలో పుష్కలంగా నీరు ఉండటంతో పీబీసీ ఉప కాలువలకు నీరు వదులుతారనే ఉద్దేశంతో రైతులు పత్తి, ఉల్లి, మినుము, తదితర పంటలు సాగులో ఉన్నాయి. పీబీసీ కాలువలో సుమారు 20కి.మీ మేర పూడికతో నిండిపోయింది. పూడిక తీసేందుకు అధికారులు చొరవ చూపడంలేదనే విమర్శలు ఉన్నాయి. కాలువలో పూడికను తొలగిస్తే తప్ప నీరు వదలలేని పరిస్థితి. పీబీసీ కాలువకు నీరు వదలకపోతే పంటలకు నీరు అందదు. దీంతో పీబీసీ అధికారులు ఏమి చేయాలో దిక్కుతోచని స్థితిలో ఉండిపోయారు.

ఎండుతున్న పంటలు

పీబీసీ కాలువకు గత పదిరోజులుగా నీటిని నిలిపివేశారు. కాలువ నీటినే నమ్ముకుని పంటలు సాగు చేసిన రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. పంటలకు పది రోజులుగా నీరు అందడంలేదు. రైతులు ఉప కాలువలో ఇంజన్లు, మోటార్లు అమర్చుకుని పంటలు సాగు చేశారు. పీబీసీ కాలువ పూడికతీత సాకుతో అధికారులు నీరు వదలడం లేదని రైతులు అంటున్నారు. కాలువకు నీరు వదలకపోతే సాగులో ఉన్న పంటలు ఎండిపోయే ప్రమాదం ఉంది. ఇప్పటికే సాగునీరు అందక పంటలు ఎండుదశకు చేరుకున్నాయి. మరో పది రోజుల్లో కాలువలకు నీరు వదులుతామని పీబీసీ అధికారులు చెబుతున్నా అంతవరకు పంటలు ఎలా తట్టుకుంటాయని రైతులు ప్రశ్నిస్తున్నారు.

ఆందోళనలో రైతులు

పులివెందుల బ్రాంచ్ కెనాల్ ఉప కాలువల కింద పంటలు సాగు చేసిన రైతులు ఆందోళన చెందుతున్నారు. కాలువ నీటిని నమ్ముకుని పెట్టుబడులు పెట్టి పంటలు సాగు చేస్తే ఇలాంటి పరిస్థితి ఎదురవుతుందని ఊహించలేకపోయామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాలువలో పూడిక తీసే వరకు నీటిని వదలకపోతే అంతవరకు సాగునీరు అందకపోతే పంటలు ఎండిపోతాయని వాపోతున్నారు. పీబీసీ కాలువ, ఉపకాలువల కింద సాగులో ఉన్న పంటలకు నీరు ఇచ్చి పంటలు ఎండిపోకుండా చూడాలని రైతులు కోరుతున్నారు.

చంద్రబాబు మోసాలను ఎండగడదాం

నియోజకవర్గ ఇన్‌చార్జి నరేన్ రామాంజులరెడ్డి



చంద్రబాబు ష్యూరిటీ, మోసం గ్యారంటీ క్యూర్ కోడ్‌ను ఆవిష్కరిస్తున్న నరేన్ రామాంజులరెడ్డి

వీరపునాయునిపల్లె/పెండ్లిమర్రి: కూటమి ఏడాది పాలనలో ఎన్నికల హామీలు అమలు చేయకుండా ముఖ్యమంత్రి చంద్రబాబుతో సహా కూటమి నేతలు చేస్తున్న మోసాలను ఇంటింటికి వెళ్లి ప్రజల వద్ద ఎండగడదామని కమలాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి నరేన్ రామాంజులరెడ్డి పిలుపునిచ్చారు. మండల కన్వీనర్ రఘునాథరెడ్డి ఆధ్వర్యంలో సోమవారం వీరపునాయునిపల్లెలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో బాబు ష్యూరిటీ.. మోసం గ్యారంటీ క్యూర్ కోడ్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు మోసాలకు అంతులేకుండా పోయిందని విమర్శించారు. మహిళలకు ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు అని చెప్పి, గత సంవత్సరంలో ఒక్క సిలిండర్‌నే కేటాయించిందని, పలు నిబంధనలతో కొంతమందికే పథకం పరిమితం చేసినప్పటికీ నేటికీ చాలామంది ఖాతాల్లో సబ్సిడీ డబ్బులు వెయ్యలేదని విమర్శించారు. అన్నదాతలు పెట్టుబడి సహాయం కింద రైతు భరోసా పథకానికి సుఖీభవ అనే పేరు మార్చిన రైతన్నలకు ఇస్తామన్న 20 వేల నగదును నేటికీ ఇవ్వలేదన్నారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు అండగా ఉంటామని పార్టీ శ్రేణులకు భరోసా ఇచ్చారు. అక్రమ అరెస్టులతో భయానక వాతావరణం సృష్టిస్తున్నారని బెదిరింపులకు భయపడే ప్రసక్తేలేదన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలను అమలు చేసేంతవరకు పార్టీ తరఫున పోరాడుతామని ప్రకటించారు. ఈ నెల 20వ తేదీ నుంచి ఆగస్టు 4వ తేదీ వరకు గ్రామ స్థాయిలో సమావేశాలు నిర్వహించి రాష్ట్ర ప్రభుత్వ మోసాలను ఇంటింటికీ వెళ్లి ప్రజలకు వివరించాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. రైతు నాయకుడు భాస్కర్‌రెడ్డి, నాయకులు వాసుదేవరెడ్డి, వెంకటరామిరెడ్డి, గంగిరెడ్డి, రాఘవ యాదవ్, ప్రతాప్ యాదవ్, చంద్రశేఖర్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్ల ఏర్పాటును విరమించుకోవాలి



విద్యుత్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

జమ్మలమడుగు రూరల్ (మైలవరం): విద్యుత్ కనెక్షన్లకు స్మార్ట్‌మీటర్ల ఏర్పాటు ప్రక్రియను విరమించుకోవాలని చేనేత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు వి. శివ నారాయణ డిమాండ్ చేశారు. సోమవారం సీపీఎం ఆధ్వర్యంలో మైలవరం మండల కేంద్రంలో ప్రభుత్వ చర్యలను నిరసిస్తూ విద్యుత్ శాఖ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తంచేశారు. అనంతరం అధికారులకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా శివ నారాయణ మాట్లాడుతూ గృహ, వాణిజ్య, పారిశ్రామిక విద్యుత్ కనెక్షన్‌లకు స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేసి వినియోగదారులపై భారం వేయడం తగదన్నారు.మంత్రి నారా లోకేష్ యువగళం పాదయాత్రలో స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేస్తే వాటిని ప్రజలు పగులగొట్టాలని ఇచ్చిన పిలుపును ఆయన మరచిపోయారా అని ప్రశ్నించారు. స్మార్ట్ మీటర్లను బిగించడాన్ని ప్రభుత్వం ఉపసంహరించుకోకపోతే మరో విద్యుత్ ఉద్యమం తప్పదని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు కొండయ్య, లక్ష్మీనారాయణ, శేషయ్య, గొరిగె కృష్ణ, నారాయణ, దాసు తదితరులు పాల్గొన్నారు.

ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణిస్తే చర్యలు



వాహనాలను తనిఖీ చేస్తున్న సీఐ నరసింహులు, సిబ్బంది

వేంపల్లె : ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను తీసుకెళితే కఠిన చర్యలు తప్పవని సీఐ నరసింహులు పేర్కొన్నారు. సోమవారం సాయంత్రం వేంపల్లెలోని స్థానిక బైపాస్‌రోడ్డులో సీఐ నరసింహులు వాహనాల తనిఖీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన కూలీలను వేసుకుని అధిక లోడుతో వెళ్లుతున్న ఆటోలను నిలిపి రికార్డులను తనిఖీ చేసి జరిమానాలు విధించారు. అలాగే కూలీలకు తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. ఆటోలలో ఎక్కువ సంఖ్యలో ప్రయాణికులు ప్రయాణించడం వలన ప్రమాదాలు జరిగినప్పుడు మృత్యువాత పడే అవకాశం ఉందన్నారు. ఆటోల్లో అధిక సంఖ్యలో ప్రయాణికులను ఎక్కిస్తే ఆటో డ్రైవర్లకు చెందిన లైసెన్సులు రద్దు చేస్తామని తెలిపారు.

విద్యుత్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



నిరసన వ్యక్తం చేస్తున్న విద్యుత్ కార్మికులు

జమ్మలమడుగు: ఏపీ విద్యుత్ ఉత్పత్తి సంస్థలో పని చేస్తున్న ఉద్యోగులు, కార్మిక సమస్యలు వెంటనే పరిష్కారం చేయాలని ఏఐటీయూసీ ఆర్టీపీపీ కార్యదర్శి ఓబులేసు, జెన్కో కాంట్రాక్టు విభాగం రాష్ట్ర కార్యదర్శి ఎస్.రాములు పేర్కొన్నారు. సోమవారం ఎర్రగుంట్ల మండలంలోని ఆర్టీపీపీ ప్రధాన రహదారి గేటు వద్ద నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యుత్ ఉత్పత్తి సంస్థలో పనిచేసే ఉద్యోగులు, కార్మికుల సమస్యలను పరిష్కారం చేయాలని అనేక సార్లు వివరించిన యాజమాన్యాలు పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కాంట్రాక్టు ఔట్ సోర్సింగ్ ప్రతిపాదకన చాలిచాలని జీతాలతో ఉద్యోగ భద్రత లేకుండా పనిచేస్తున్న వారందరికీ మూడో వ్యక్తి ప్రమేయం లేకుండా సంస్థనే నేరుగా జీతాలు చెల్లించి అందరిని రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. 2022 పీఆర్‌సీ వేతన బకాయిలు మొత్తాని ఒకేసారి చెల్లించాలని కోరారు. కార్మికుల సమస్యలను ప్రభుత్వానికి తెలియజేయాలంటే గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగుల సమస్య పరిష్కారం కోసం ఈనెల 21వ తేది చలో విజయవాడ కార్యక్రమానికి పిలుపునిచ్చామని తెలిపారు. ఏఐటీయూసీ వర్కింగ్ ప్రెసిడెంట్ నరసింహులు, బాల సుబ్బయ్య, సాంబశివారెడ్డి, సుబ్బరాయుడు, దస్తగిరి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

వేంపల్లె : వేంపల్లె పంచాయతీ పరిధిలోని రాజారెడ్డి నగర్ ఫీడర్‌లోని 33/11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా మంగళవారం విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నామని విద్యుత్తు జేఈ శివ దినేష్ రెడ్డి ఒక ప్రకటనలో చెప్పారు. రాజారెడ్డి నగర్ ఫీడర్‌లోని విద్యుత్ సబ్ స్టేషన్లో మరమ్మతులు చేస్తున్న కారణంగా ఎల్‌సీ తీసుకోవడం జరుగుతుందని, రాయచోటి బైపాస్, శివుని మాన్యం, ఐటీఐ ఏరియా, గంటన్న బట్టీలు, ఎన్టీఆర్ సర్కిల్, ఆర్ ఎస్ కాలనీ, ఫైర్ స్టేషన్, ఎస్ఎస్ఆర్ కల్యాణ మండపం ప్రాంతాల్లో ఉదయం 9గంటల నుంచి 12.30 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

పీహెచ్‌సీ తనిఖీ



ఆసుపత్రి సిబ్బందితో మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఖాజామొహిద్దీన్

తొండూరు : మండల కేంద్రమైన తొండూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సోమవారం డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఖాజామొహిద్దీన్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన పీహెచ్‌సీలోని రికార్డులను, నివేదికలను పరిశీలించారు. అలాగే సిబ్బంది పనితీరును అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు అన్ని రకాల సేవలు సకాలంలో అందించాలని, ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ డాక్టర్లు అరిఫుల్లా, రేష్మా, సీహెచ్‌ఓ విజయ, డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ అధికారి మల్లయ్య, మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ సిద్ధయ్య, ఆసుపత్రి సిబ్బంది నరేష్, శశికళ, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

అతివేగం ప్రమాదకరం



యువకులకు కౌన్సిలింగ్ ఇస్తున్న సీఐ

పులివెందుల రూరల్ : యువత ద్విచక్ర వాహనాల్లో అతివేగంగా వెళ్లి ప్రాణాలను పోగొట్టుకుంటున్నారని సీఐ చాంద్‌బాషా పేర్కొన్నారు. సోమవారం సాయంత్రం పట్టణంలోని ముద్దనూరు రోడ్డులోని జెఎన్‌టీయూ సమీపంలో వాహనాల తనిఖీ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన బైకు రేసింగ్ చేస్తున్న యువకులను ఆపి వారికి కౌన్సిలింగ్ ఇచ్చారు. సీఐ చాంద్‌బాషా మాట్లాడుతూ బైక్ రేసింగ్ చేయడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని తెలిపారు. యువత చాలామంది బైకు రేసింగ్ చేస్తే కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. తల్లిదండ్రులు కూడా చిన్న పిల్లలకు బైకులు ఇవ్వకూడదన్నారు. త్రిబుల్ రైడింగ్ చేస్తున్న వారిపై కేసు నమోదు చేసి జరిమానా విధించారు. అలాగే రింగ్ రోడ్డు సమీపంలో కూడా వాహనాలను తనిఖీ చేసి జరిమానాలు విధించారు.

తాగునీటి పైపులైన్ పగిలి ఆస్తి నష్టం



పైపులైన్ పగిలిపోవడంతో వృథాగా పోతున్న నీరు

లింగాల : లింగాల మండలం కర్ణపాపాయపల్లె గ్రామంలో గురువారం నిర్మాణంలో ఉన్న భారీ తాగునీటి పైపులైన్ పగిలిపోయి భారీగా ఆస్తి నష్టం సంభవించింది. పైపులైన్ పరీక్షల కోసం అదాని కంపెనీ అధికారులు పైపులైన్‌కు నీరు విడుదల చేశారు. దీంతో ఒక్కసారిగా కర్ణపాపాయపల్లె గ్రామంలో పైపులైన్ పగిలిపోవడంతో నీరు భారీగా బయటకు రావడం జరిగింది. భారీ నీటి ప్రవాహం వల్ల గడ్డి వాములు తడిసిపోయి తీవ్ర నష్టం జరిగింది. ఇళ్లలోకి నీరు ప్రవేశించి తీవ్ర నష్టం జరిగింది. దీంతో రైతులు సంబంధిత అధికారులను నిలదీశారు. నష్టపరిహారం చెల్లిస్తామని హామీ ఇచ్చారు. అయితే ఇంతవరకు పట్టించుకోలేదని నష్టపోయిన రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకుని నష్టపోయిన రైతులకు నష్టపరిహారం అందించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

మహాసభలను జయప్రదం చేయండి

జమ్మలమడుగు: బద్వేలులో ఈనెల 22 నుంచి 24వ తేది వరకు నిర్వహించే సీపీఐ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు సుబ్బారెడ్డి కోరారు. సోమవారం ఎర్రగుంట్ల పట్టణంలోని పార్టీ కార్యాలయంలో జిల్లా మహాసభలకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు.

మినీ లారీ బోల్తా

తప్పిన పెను ప్రమాదం



పైడిపాలెం గ్రామ సమీపంలో బోల్తా పడిన మినీ లారీ

సింహాద్రిపురం : మండలంలోని పైడిపాలెం - చవ్వారిపల్లె గ్రామాల మధ్య సోమవారం చీనీ కూలీలతో వెళుతున్న మినీ లారీ బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఇద్దరి వ్యక్తులకు గాయాలు కాగా, మిగిలిన వారు క్షేమంగా బయటపడటంతో పెను ప్రమాదం తప్పింది. గ్రామస్తుల కథనం మేరకు కొండాపురం మండలం తాళ్ల ప్రొద్దుటూరుకు చెందిన కూలీల వాహనం సోమవారం ఉదయం పైడిపాలెం గ్రామానికి చీనీ కాయల కోతకు కూలీలను తీసుకొచ్చింది. తిరుగు ప్రయాణంలో కూలీల వాహనం ప్రమాదానికి గురైంది. ఈ ప్రమాదంలో ఇద్దరికి గాయాలు కావడంతో వెంటనే గ్రామస్తులు స్పందించి 108 అంబులెన్స్‌లో క్షతగాత్రులను తరలించారు. మినీ లారీ వాహనం గోతిలో పడి ఉంటే పెద్ద ప్రమాదం సంభవించడంతోపాటు ప్రాణ నష్టం ఎక్కువ జరిగేది అని గ్రామస్తులు తెలిపారు.

పొంచి ఉన్న ప్రమాదం



ట్రాన్స్‌ఫార్మర్ వద్ద బస్సుల కోసం వేచి ఉన్న విద్యార్థులు

జమ్మలమడుగు రూరల్: జమ్మలమడుగు పట్టణ పరిధిలోని పెద్దపసుపల రహదారిలో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వల్ల విద్యార్థులకు ప్రమాదం పొంచి ఉంది. తాడిపత్రి రహదారి- పెద్దపసుపల రహదారి మధ్యలో ఓ ప్రైవేట్ పాఠశాలను నిర్మించారు. పాఠశాలకు రెండు మార్గాల ద్వారా విద్యార్థులు వెళుతుంటారు. కాగా పెద్దపసుపల రహదారిలో పాఠశాల గేట్ పక్కన విద్యుత్ అధికారులు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశారు. పాఠశాల విరామం సమయంలో విద్యార్థులు ఆడుకోవడానికి బయటకు వస్తూ ఉంటారు. పెద్దపుసుపుల తదితర గ్రామాలకు వెళ్లేందుకు గేట్ వద్దనే బస్సులు, ఆటోల కోసం వేచి ఉంటారు. ఈ క్రమంలో విద్యార్థులు విద్యుదాఘాతానికి గురయ్యే ప్రమాదం ఉందని స్థానికులు వాపోతున్నారు. ట్రాన్స్‌కో అధికారులు ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ కంచె ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

14 ద్విచక్ర వాహనాలు స్వాధీనం

జమ్మలమడుగు రూరల్: పట్టణంలో డ్రైవింగ్ లైసెన్స్, సైలెన్సర్ లేకుండా తిరుగుతున్న 14 ద్విచక్ర వాహనాలను పట్టణ ఎస్ఐలు రామక్రిష్ణ, హైమావతి స్వాధీనం చేసుకున్నారు. సోమవారం సాయంత్రం పట్టణంలో సీఐ లింగప్ప ఆదేశాల మేరకు వారు దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణంలో వాహనదారులు తమ వాహనాలకు సంబంధించిన రికార్డ్‌లను తప్పనిసరిగి పెట్టుకోని డ్రైవింగ్ చేయాలన్నారు. అలాగే ద్విచక్ర వాహనదారులు తమ వాహనాలకు సైలెన్సర్‌లు తీసువేసి రోడ్డు మీద ప్రయాణిస్తే వారిపై కేసులు నమోదు చేసి వాహనాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. వాహనదారులుట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. బైక్‌లు నడిపేవారు తప్పనిసరిగా హెల్మెట్ వాడాలని పేర్కొన్నారు. రోడ్డు నిబంధనలు పాటించి పోలీసులకు సహకరించాలని కోరారు.

ఇది రోడ్డా.. చెరువా?

సింహాద్రిపురం : సింహాద్రిపురం - వెలిదండ్ల ప్రధాన రహదారిలని బిదినంచర్ల గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద ప్రధాన రహదారిపై నీరు నిలబడి చెరువును తలపిస్తోంది. ఈ నీరు చిత్రావతి ప్రాజెక్టు నుంచి వివిధ గ్రామాలకు ఫ్లోరైడ్ రహిత నీటిని పైపుల అందించడానికి ఏర్పాటు చేసిన పైపులు పగిలి నీరు వృథాగా పోతోంది. దీంతో రహదారి చెరువును మురికి కుంటను తలపిస్తోంది. గతంలో నీరు నిలిచిన చోట పెద్ద గుంత ఏర్పడి పలు ప్రమాదాలు కూడా జరిగాయి. అప్పట్లో ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి స్పందించి వచ్చే నీటికి కాలువను ఏర్పాటు చేసి పీబీసీ కాలువలోకి మళ్లించి అక్కడ నీరు నిలబడకుండా చేయించారు. కానీ ఈ మధ్యనే నీరు పోవడానికి ఏర్పాటు చేసిన కాలువలో ఓ కంపెనీ వారు మంచినీటి పైపులు ఏర్పాటు చేయడంతో ఆ నీటి సమస్య మళ్లీ మొదటికొచ్చింది. దీంతో వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వెంటనే సంబంధిత అధికారులు స్పందించి ప్రధాన రహదారిపై నీరు నిలబడకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.



సింహాద్రిపురం - వెలిదండ్ల ప్రధాన రహదారిపై నిలిచిన నీరు

కూటమి వైఫల్యాలను ప్రజలకు చెబుదాం

ఎమ్మెల్సీ పి.రామసుబ్బారెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ పి. రామసుబ్బారెడ్డి

జమ్మలమడుగు: రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు చాటిచెబుదామని ఎమ్మెల్సీ పి. రామసుబ్బారెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం పార్టీ కార్యాలయంలో పెద్దముడియం మండలాధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి అధ్యక్షతన బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని ఏవిధంగా చేయాలో వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో అభివృద్ధి, సంక్షేమం శూన్యమని విమర్శించారు. కూటమి పాలనలో అంతా చీకటిమయమన్నారు. ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా పేదల జీవితాల్లో చీకట్లు నింపిందని తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు గ్రామాల్లో పర్యటించి కూటమి నాయకుల మోసాలను ప్రజలకు వివరించాలని కోరారు. రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం నడుస్తోందని మండిపడ్డారు. కూటమి వైఫల్యాలను ఇంటింటా ఎండగడుదామని పిలుపునిచ్చారు. ప్రతి కార్యకర్త గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి చేయాలని, రాబోయే స్థానిక ఎన్నికల్లో పార్టీ బలం ఏమిటో కూటమి నాయకులకు చూపిద్దామని పిలుపునిచ్చారు. గ్రామాల్లో ఎటువంటి గొడవలు లేకుండా ప్రశాంత వాతావరణం ఉండాలని సూచించారు. టీడీపీ నాయకులు ఎవరైనా గొడవలకు సృష్టించినా.. దాడులకు దిగినా తగ్గేదేలేదని స్పష్టం చేశారు. ప్రతి కార్యకర్తకు అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఇప్పటికే జమ్మలమడుగులో పార్టీ ఆదేశాలకు ప్రతి కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహిస్తున్నామని తెలిపారు.

రాజోలి రైతులను ఆదుకోవాలి

ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి రాజోలి ఆనకట్ట కింద ముంపు గ్రామాలకు ఎకరాకు 24 లక్షల రూపాయలు ఇస్తామని ప్రకటించారని, ఇప్పటికీ రైతులకు నష్టపరిహారం ఇవ్వలేదని పేర్కొన్నారు. రాజోలి నిర్వాసితులపై శాసన మండలిలో తాను ప్రస్తావించానని గుర్తుచేశారు. రాజోలి నిర్వాసితులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. గండికోట ముంపువాసులకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రూ. 10 లక్షల పెంచి పరిహారం ఇచ్చారని, ఇంకా 14 గ్రామాల ప్రజలకు ఇవ్వాలని తెలిపారు. గండికోట ముంపు బాధితులకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఇచ్చిన పరిహారం కంటే అదనంగా రెండు లక్షల రూపాయలు ఇప్పిస్తానని ఎమ్మెల్యే ప్రకటించారని, ఇప్పటివరకు హామీని ఆయన నెలబెట్టుకోలేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు గిరిధర్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి రమణారెడ్డి, కొట్టాలపల్లి నారాయణరెడ్డి, భరత్‌రెడ్డి, సుద్దపల్లె సుధాకర్‌రెడ్డి, పెద్దముడియం శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.